క్లుప్తంగా

రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక


రేణుకమ్మను అభినందిస్తున్న ఉపాధ్యాయులు

బొమ్మనహాళ్: ఎస్‌జీఎఫ్ ఆధ్వర్యంలో త్వరలో జరిగే రాష్ట్రస్థాయి సెపక్ తక్రా పోటీలకు మండలంలోని దర్గాహొన్నూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 9వ తరగతి చదువుతున్న రేణుకమ్మ ఎంపికైనట్లు హెచ్‌ఎం రవిప్రసాద్ తెలిపారు. ఈ నెల 9, 10, 11 తేదీల్లో విజయవాడలో జరగనున్న రాష్ట్రస్థాయి సెపక్‌తక్రా పోటీల్లో రేణుకమ్మ పాల్గొంటుందని వ్యాయామ ఉపాధ్యాయులు ఎ.హామీమా, కృష్ణ తెలిపారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, గ్రామస్తులు విద్యార్థినిని అభినందించారు.

అంగన్‌వాడీ కేంద్రం తనిఖీ

కళ్యాణదుర్గం: గర్భిణులు పౌష్టికాహారం తీసుకుంటూ జాగ్రత్తలు పాటించాలని సీడీపీఓ లక్ష్మీ ప్రసన్న తెలిపారు. పట్టణంలోని పార్వతి నగర్‌లోని అంగన్‌వాడీ కేంద్రాన్ని బుధవారం నిఖీ చేశారు. ఈ సందర్భంగా కేంద్రానికి వచ్చే చిన్నారుల హాజరు శాతం, వైఎస్సార్ పోషణ కిట్ల పంపిణీపై ఆరా తీశారు. అంగన్‌వాడీ ద్వారా సరుకులు సక్రమంగా అందించాలన్నారు.

జాతీయస్థాయి హాకీ పోటీలకు ఎంపిక


అభిషేక్‌ను అభినందిస్తున్న హెచ్‌ఎం, పీడీ

విడపనకల్లు: పాల్తూరు జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థి రాష్ట్రస్థాయి హాకీ పోటీలకు ఎంపికైనట్లు పాఠశాల పీడీ శ్రీనివాసులు తెలిపారు. ఈనెల 3,4,5 తేదీల్లో అనకాపల్లిలో జరిగిన హాకీ పోటీల్లో అండర్–17 విభాగంలో పాఠశాల పదో తరగతి విద్యార్థి అభిషేక్ ప్రతిభ చాటి డిసెంబర్‌లో జరిగే జాతీయస్థాయి పోటీలకు ఎంపికయ్యాడన్నారు. బుధవారం పాఠశాల హెచ్‌ఎం సర్వమంగళం, ఉపాధ్యాయులు విద్యార్థిని అభినందించారు.

డ్రైవింగ్ శిక్షణకు దరఖాస్తు చేసుకోండి


కుందుర్పి: ఆర్‌డీటీ ఏఎఫ్ ఎకాలజీ ఆధ్వర్యంలో 45 రోజుల పాటు ఎల్‌వీఎం డ్రైవింగ్ శిక్షణకు నిరుద్యోగ యువకులు దరఖాస్తు చేసుకోవాలని ఆ సంస్థ మండల కో–ఆర్డినేటర్ శివశంకర్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. కళ్యాణదుర్గం ఏఎఫ్ ఎకాలజీ కార్యాలయంలో ఈనెల 18 నుంచి డ్రైవింగ్ శిక్షణ ప్రారంభం అవుతుందన్నారు. 19–35 మధ్య వయస్సు గల యువకులు రూ.3,500 ఫీజు చెల్లించి పేర్లు నమోదు చేసుకోవాలన్నారు.

విద్యాభివృద్ధికి ప్రభుత్వం పెద్దపీట


ల్యాప్‌ట్యాప్ అందజేస్తున్న కలెక్టర్ గౌతమి

కుందుర్పి: విద్యాభివృద్ధికి ప్రభుత్వం పెద్దపీట వేస్తూ కార్పొరేట్ కళాశాలలకు దీటుగా నాణ్యమైన విద్యను అందిస్తోందని వైఎస్సార్‌సీపీ మండల ఎగ్జిక్యూటివ్ సభ్యుడు కేపీ గోపాల్ పేర్కొన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలో కలెక్టర్ గౌతమి చేతుల మీదుగా మండలంలోని 5 మంది వికలాంగ విద్యార్థులు రూ.38 వేలు విలువైన ల్యాప్‌ట్యాప్‌లు అందుకున్నట్లు పేర్కొన్నారు. చందన, అశ్విని, నరసింహులు, మునిరా, రామ్‌చరణ్ ల్యాప్‌టాప్స్ అందుకున్నారన్నారు.

రైతుల అభివృద్ధే ధ్యేయం


మాట్లాడుతున్న ఏడీసీసీ బ్యాంక్ డైరెక్టర్ రామాంజనేయులు

బ్రహ్మసముద్రం: రైతుల అభివృద్ధే సహకార సంఘం ధ్యేయమని ఏడీసీసీ బ్యాంక్ డైరెక్టర్ రామాంజనేయులు అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని భైరవానితిప్ప సహకార సంఘం (సొసైటీ) కార్యాలయంలో ఘర్ ఘర్ కేసీసీ అభియాన్‌పై రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రైతులందరూ (కేసీసీ) కిసాన్ క్రెడిట్ కార్డును ఆధునీకరించుకోవాలని తెలిపారు. పీఎం కిసాన్ లబ్ధిదారులకు కేసీసీ లేకపోతే సత్వరమే రుణ సదుపాయం కల్పించడం జరుగుతుందన్నారు. నాబార్డ్ ఆదేశాలతో ఈ పథకాన్ని ప్రవేశపెట్టడం జరిగిందన్నారు. కార్యక్రమంలో కళ్యాణదుర్గం ఏడీసీసీ బ్యాంక్ మేనేజర్ హనుమంత రాయుడు తదితరులు పాల్గొన్నారు.

జనంలోకి 'జగన్' సైన్యం !

- నేటి నుంచి ప్రారంభం కానున్న 'వై ఏపీ నీడ్స్ జగన్'
- ప్రభుత్వం చేసిన మేలును ప్రజలకు వివరించేలా ప్రణాళికలు
- వరుస కార్యక్రమాలతో వైఎస్సార్‌సీపీలో జోష్



రాయదుర్గం: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ మరో నూతన కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. దాన్ని జనంలోకి తీసుకెళ్లి విజయవంతం చేసేలా 'జగన్' సైన్యం సిద్ధమైంది. ఇప్పటికే కళ్యాణదుర్గం, రాయదుర్గం, ఉరవకొండ నియోజకవర్గాల్లోని అన్ని మండలాల్లోనూ మంత్రి ఉషశ్రీచరణ్, ప్రభుత్వ విప్ కాపు రామచంద్రారెడ్డి, వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త విశ్వేశ్వరరెడ్డి ఆధ్వర్యంలో పార్టీ సమావేశాలు నిర్వహించారు. కార్యక్రమ ముఖ్య ఉద్దేశంపై పార్టీ శ్రేణులకు దిశా నిర్దేశం చేశారు. గురువారం నుంచి 'వై ఏపీ నీడ్స్ జగన్' కార్యక్రమం లాంఛనంగా ప్రారంభం కానుంది. ఆయా గ్రామ/వార్డు సచివాలయాల్లో చేపట్టే కార్యక్రమాల జాబితాను పార్టీ నాయకత్వం రూపొందించింది.

చేసిన మేలు తెలిపేలా...

ప్రజా సంక్షేమం కోసం ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి చిత్తశుద్ధితో కృషి చేస్తున్నారు. ఇప్పటికే గడప గడపకూ మన ప్రభుత్వం, మా నమ్మకం నువ్వే జగన్, జగనన్నే మా భవిష్యత్తు లాంటి కార్యక్రమాలు చేశారు. తాజాగా 'వై ఏపీ నీడ్స్ జగన్' కార్యక్రమం ద్వారా గడిచిన నాలుగేళ్లలో రాష్ట్ర ప్రభుత్వం చేకూర్చిన లబ్ధిని ప్రజలందరికీ వివరించేలా కార్యాచరణ చేపట్టారు.

ఊరూరా పార్టీ జెండా ఆవిష్కరణ

పట్టణంలోని అన్నీ వార్డులతో పాటు ఊరురా వైఎస్సార్‌సీపీ జెండా ఆవిష్కరించడంతో పాటు ఎంపిక చేసుకున్న వార్డు/ గ్రామ సచివాలయం పరిధిలో చైర్‌పర్సన్లు, కౌన్సిలర్లు, ఎంపీపీ, జెడ్పీటీసీ, పార్టీ మండల కన్వీనర్లు, సచివాలయ కన్వీనర్లు, గృహ సారథులు, పార్టీ ముఖ్య నాయకుల ఆధ్వర్యంలో రాత్రి అక్కడే బసచేయనున్నారు. ఉదయం గ్రామంలోని ప్రధాన సమస్యలు గుర్తించి పరిష్కారానికి చర్యలు చేపడతారు.

సమర్థవంతంగా నిర్వహిద్దాం

వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమాన్ని సమర్థవంతంగా నిర్వహించేలా కృషి చేద్దామని వైఎస్సార్‌సీపీ రైతు విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గౌని ఉపేంద్రారెడ్డి పిలుపునిచ్చారు. పట్టణంలోని రోడ్లు, భవనాలశాఖ అతిథి గృహంలో మున్సిపల్ చైర్‌పర్సన్ పొరాళ్ల శిల్ప అధ్యక్షతన 32 వార్డు కౌన్సిలర్లు, పార్టీ ఇన్‌చార్జులతో సమావేశం నిర్వహించారు. కార్యక్రమం విజయవంతంపై చర్చించారు. ఈ నెల 9 నుంచి 23వ తేదీ వరకూ తొలుత చేపట్టే 10 వార్డు సచివాలయాల్లో చేపట్టే కార్యక్రమాలపై ఆయా వార్డుల కౌన్సిలర్లకు బాధ్యతలు అప్పగించారు. వైస్ చైర్మన్లు శ్రీనివాస్‌యాదవ్, వలీబాష, పట్టణ కన్వీనర్ అరవ శివప్ప, వార్డు సచివాలయాల కన్వీనర్ బుజ్జి, అన్నీ వార్డుల కౌన్సిలర్లు, వార్డు ఇన్‌చార్జులు పాల్గొన్నారు.

అందరూ భాగస్వామ్యం కావాలి



పట్టణంతో పాటు అన్నీ మండలాల్లోనూ ఒక్కో సచివాలయం పరిధిలో 'వైఏపీ నీడ్స్ జగన్' కార్యక్రమం ప్రారంభిస్తున్నాం. పార్టీ నాయకత్వం మొత్తం భాగస్వామ్యులై ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలి. సీఎం జగన్ చేసిన మేలును ఇంటింటా వివరించే బాధ్యతను నాయకులు, కార్యకర్తలు తీసుకోవాలి. టీడీపీ హయాంలో చంద్రబాబు చేసిన మోసాలను ప్రజలకు వివరించాలి.

– కాపు రామచంద్రారెడ్డి, ప్రభుత్వ విప్

కళ్యాణదుర్గంలో షెడ్యూల్ ఇలా..

కళ్యాణదుర్గం: రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలు ప్రజలకు ఎంత మేర అందుతున్నాయన్న దానిపై ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమాన్ని గురువారం నుంచి ప్రారంభించనున్నట్లు ఎంపీడీఓ సాలమాన్ తెలిపారు. ఈనెల 9న నారాయణపురం, 10న గోళ్ల, 14న పాలవాయి, 15న తిమ్మసముద్రం, 16న మానిరేవు, 17న చాపిరి, 20న బ్యాడ్రహళ్లి, 21న బోరంపల్లి, 22న దురదకుంట, 23న ఈస్ట్ కోడిపల్లి గ్రామాల్లో కార్యక్రమం ఉంటుందన్నారు.

మున్సిపాలిటీ పరిధిలో..

మున్సిపాలిటీ పరిధిలో ఈనెల 9 నుంచి వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు మున్సిపల్ కమిషనర్ వెంకటేశులు తెలిపారు. ఈనెల 9న దొడగట్ట, 10న ఒంటిమిద్ది, 14న ముదిగల్లు, 15న రెవెన్యూ కాలనీ, 16న మారెంపల్లి, 17న కమ్మాన్‌చెట్ల వీధి, 20న వడ్డే కాలనీ, 21న ఇందిరమ్మ కాలనీ, 22న కుమ్మరవీధి, 23న న్యూ ఎస్సీ కాలనీలలో నిర్వహించనున్నట్లు తెలిపారు. ఆయా మున్సిపల్ కౌన్సిలర్లు, వార్డు అడ్మిన్లు, సచివాలయ ఉద్యోగులు తప్పక హాజరుకావాలని తెలిపారు.

శెట్టూరు మండలంలో షెడ్యూల్..

శెట్టూరు: వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమానికి సంబంధించిన షెడ్యూల్ విడుదలైనట్లు ఇన్‌చార్జ్ ఎంపీడీఓ రఘురామరావు ప్రకటనలో తెలిపారు. ఈనెల 9న శెట్టూరు మండల కేంద్రంలో, 10న పెరుగుపాళ్యం, 14న ములకలడు, 15న యాటకల్లు–1, 16న యాటకల్లు–2, 17న తిప్పనపల్లి, 20న కైరేవు–1, 21న కైరేవు–2, 22న చింతర్లపల్లి, 23న కనుకూరు సచివాలయాల్లో కార్యక్రమం నిర్వహిస్తామని పేర్కొన్నారు.

నేటి నుంచి 'వై ఏపీ నీడ్స్ జగన్'

రాయదుర్గంటౌన్: పట్టణంలో తొలి విడతగా 1 నుంచి 10 సచివాలయాల పరిధిలో 'వై ఏపీ నీడ్స్ జగన్' కార్యక్రమాన్ని ఈ నెల 23 వరకు నిర్వహించనున్నట్లు మున్సిపల్ కమిషనర్ దివాకర్‌రెడ్డి తెలిపారు. 9వ తేదీ గురువారం పట్టణంలోని పార్వతీనగర్‌లోని 1వ సచివాలయంలో వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమం జరుగుతుందన్నారు. మధ్యాహ్నం 3 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు కార్యక్రమం నిర్వహించాల్సి ఉంటుందన్నారు. సంక్షేమ పథకాల బుక్‌లెట్లను సచివాలయ కార్యదర్శులు, వలంటీర్లు ఇంటింటికీ పంపిణీ చేస్తారన్నారు.

'వై ఏపీ నీడ్స్ జగన్'ను జయప్రదం చేయండి

ఉరవకొండ: ఆమిద్యాల సచివాలయం–1 పరిధిలో గురువారం తలపెట్టిన వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని వైఎస్సార్‌సీపీ నాయకులు కోరారు. బుధవారం స్థానిక పార్టీ కార్యాలయంలో రూరల్ కన్వీనర్ మూస్టురు సుంకన్న, మండల సమన్వయకర్త ఓబన్న, కురుబ కార్పొరేషన్ డైరెక్టర్ గోవిందు, పెన్నహోబిళం ఆలయ మాజీ చైర్మన్ అశోక్ విలేకరులతో మాట్లాడారు. సచివాలయాల పరిధిలో ప్రభుత్వం నాలుగున్నరేళ్లలో చేసిన అభివృద్ధి, సంక్షేమ పథకాలను ఆధారాలతో సహా వివరిస్తామన్నారు. కార్యక్రమంలో ఉలిగప్ప, బూదగవి భీమేష్, ఆమిద్యాల రాజేష్, నాగరాజు, ఎంపీటీసీ ఈశ్వర్, ప్రసాద్‌నాయక్ పాల్గొన్నారు.

కూడేరు: బోళసముద్రంలో గురువారం 'వై ఏపీ నీడ్స్ జగన్' కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ ఎంకేబాషా, ఆ కార్యక్రమ సచివాలయ ఇన్‌చార్జులు దేవేంద్ర, వడ్డే గంగాధర్ బుధవారం తెలిపారు. సచివాలయ ఉద్యోగులు , ప్రజాప్రతినిధులు ,వైఎస్సార్ సీపీ నేతలు పాల్గొనాలని కోరారు.

విడపనకల్లు: పాల్తూరు సచివాలయం1 పరిధిలో గురువారం వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ శ్రీనివాసులు బుధవారం తెలిపారు. కార్యక్రమానికి స్థానిక ప్రజాప్రతినిధులు, సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు, అధికారులు తప్పకుండా హాజరు కావాలని కోరారు.

రాయదుర్గం రూరల్: మండలంలోని ఆవులదట్లలో గురువారం వై ఏపీ నీడ్స్ జగన్ (ఆంధ్రాకు జగన్ ఎందుకు కావాలంటే) కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు మండల కన్వీనర్, జెడ్పీటీసీ హొన్నే మల్లికార్జున, ఎంపీపీ విద్యావతి తెలిపారు. మధ్యాహ్నం 3 గంటలకు కార్యక్రమం ప్రారంభమవుతుందన్నారు.

కణేకల్లు: మండలంలో గురువారం నుంచి 'వై ఏపీ నీడ్స్ జగన్' కార్యక్రమం నిర్వహించన్నట్లు ఎంపీడీఓ శ్రీనివాసులు తెలిపారు. కణేకల్లు–1 గ్రామ సచివాలయంలో 9వ తేది కార్యక్రమాన్ని ప్రారంభిస్తామన్నారు.

కరువు జిల్లాను ఆదుకోవాలని సీఎంకు వినతి


సీఎం వైఎస్ జగన్‌కు వినతిపత్రం అందిస్తున్న ఎమ్మెల్సీ వై.శివరామిరెడ్డి

ఉరవకొండ: కరువు జిల్లా అనంతను ఆదుకోవాలని సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మంగళవారం పుట్టపర్తి పర్యటనలో కోరినట్లు ఎమ్మెల్సీ వై.శివరామిరెడ్డి తెలిపారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. బెళుగుప్ప, బొమ్మనహాళ్, యల్లనూరు మండలాలను కరువు జాబితాలో ప్రకటించాలని సీఎంను కోరామన్నారు. జిల్లాలో పంట ఆధారిత బీమాను అందరికీ అందించాలన్నారు. ఐదెకరాల షరతును తొలగించి ఎన్ని ఎకరాల భూమి ఉన్నా ఇన్‌పుట్ సబ్సిడీ అందించాలని కోరామన్నారు. హెచ్‌ఎన్‌ఎస్‌ఎస్ ప్రాజెక్టు కింద జీడిపల్లి రిజర్వాయర్‌లో అదనంగా 4 టీఎంసీల నీటి సామర్థ్యం పెంచేందుకు చర్యలు తీసుకుంటే 4.85 లక్షల ఎకరాలకు సాగునీరు అందుతుందన్న విషయాన్ని తెలిపామన్నారు. పంచాయతీల్లో గ్రీన్ అంబాసిడర్స్‌కు జీతాలు అందించాలని కోరామన్నారు. హంద్రీనీవా 33, 36 ప్యాకేజీల్లో భూములు కోల్పోయిన రైతులకు వెంటనే పరిహారం అందించి విజ్ఞప్తి చేసినట్లు వివరించారు.

సమస్యల పరిష్కారానికి కృషి


మాట్లాడుతున్న ఎంపీపీ చంద్రశేఖర్ రెడ్డి

బ్రహ్మసముద్రం: సమస్యల పరిష్కారమే లక్ష్యంగా సాధారణ సర్వసభ్య సమావేశం జరిగింది. బుధవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ కంభం చంద్రశేకర్ రెడ్డి అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. మండల వ్యాప్తంగా పలు గ్రామాల్లో తాగునీటి సమస్య తలెత్తే అవకాశం ఉన్నట్లు సభ్యులు సభ దృష్టికి తీసుకొచ్చారు. మండలంలో తాగునీటి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని అధికారులు తెలిపారు. గ్రామాల్లో ప్రజలకు విరివిగా ఉపాధి హామీ పనులు కల్పించి ఈ ఏడాది ప్రతి జాబ్ కార్డుకు 50 రోజులు అదనంగా పనిదినాలు కల్పిస్తున్నట్లు వెల్లడించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ దాసానాయక్ , ఈఓ ఆర్డీ వెంకట్ నాయుడు, డిప్యూటీ తహసాల్దార్ శ్రీనాథ్ రెడ్డి, వైస్ ఎంపీపీలు వెంకటేష్ నాయక్, సునందమ్మ, ఎంపీటీసీలు మారుతమ్మ, నాగలక్ష్మీ, వరలక్ష్మీ, తిప్పేస్వామి, కో–ఆప్షన్ సభ్యురాలు పార్వతి, సర్పంచ్‌లు పూజా,అంజినమ్మ, గంగమ్మ, శెట్టగారి మంజునాథ, ఆదినారాయణ రెడ్డి, రంగప్ప, మండల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

వాల్మీకి విగ్రహావిష్కరణ


వాల్మీకి విగ్రహానికి నివాళులర్పిస్తున్న దృశ్యం

డి హీరేహాళ్ (రాయదుర్గం): డీ హీరేహాళ్ మండలంలోని తమ్మేపల్లిలో బుధవారం నూతనంగా ఏర్పాటు చేసిన మహర్షి వాల్మీకి విగ్రహ ఆవిష్కరించారు. వైఎస్సార్‌సీపీ నాయకులు, పార్టీ కార్యకర్తలు, పెద్ద ఎత్తున తరలివచ్చిన వాల్మీకుల మధ్య వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ వన్నూర్ స్వామి వాల్మీకి విగ్రహానికి పూలమాలలు వేశారు. కార్యక్రమంలో సర్పంచులు శ్రీనివాస రెడ్డి, కల్యం నాగరాజు, గంగప్ప తదితరులు పాల్గొన్నారు.

పథకాలను సద్వినియోగం చేసుకోండి

కళ్యాణదుర్గం: ప్రభుత్వం రాయితీతో అందిస్తున్న ఉద్యాన పంటల పథకాలను సద్వినియోగం చేసుకోవాలని హార్టికల్చర్ అధికారి కృష్ణతేజ సూచించారు. పట్టణంలోని ఆర్‌బీకేలో బుధవారం వ్యవసాయ అధికారిణి సరితతో కలిసి ఆర్‌బీకే సిబ్బందికి పథకాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. పీఎం కిసాన్ లింకేజీ చేయని రైతులకు వెంటనే లింకేజీ చేయాలన్నారు. రైతులకు అందుబాటులో ఉండేలా ఎరువులను సిద్ధంగా ఉంచుకోవాలన్నారు. పత్తి, కొర్ర, రాగి, జొన్న పంటలు కొనుగోలు చేసే రైతులు ఆర్‌బీకేలలో రిజిస్ట్రేషన్ చేయించుకోవాలన్నారు. ఖరీఫ్‌లో పంటల నమోదు చేసిన రైతులకు రసీదులు ఇవ్వాలని చెప్పారు. ఎంఐడీహెచ్, ఆర్‌కేవీవై పథకాల కింద దానిమ్మ, జామ, మామిడి, చీనీ, డ్రాగన్ ఫ్రూట్, అల్లనేరేడు పండ్ల తోటలకు విస్తరణ పథకం కింద రాయితీ ఇస్తామన్నారు. అలాగే విడి పూల సాగు, హైబ్రిడ్ కూరగాయల సాగు, ఫారంపాండ్స్, ప్లాస్టిక్ మల్చింగ్, తైవాన్ స్ప్రేయర్ల వంటి వాటికి ప్రభుత్వం నుంచి రాయితీ లభిస్తుందన్నారు.

త్వరలోనే జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు

- మంత్రి కేవీ ఉషశ్రీచరణ్


మంత్రి కేవీ ఉషశ్రీచరణ్‌ను సన్మానిస్తున్న జర్నలిస్టులు

కళ్యాణదుర్గం: జర్నలిస్టుల సంక్షేమమే జగనన్న ధ్యేయమని రాష్ట్ర స్త్రీ, శిశు సంక్షేమ శాఖ మంత్రి కేవీ ఉషశ్రీచరణ్ అన్నారు. జర్నలిస్టులకు ఇళ్ళ స్థలాలు ఇచ్చేందుకు సీఎం వైఎస్ జగన్మోహన్‌రెడ్డి ఆధ్వర్యంలో రాష్ట్ర మంత్రిమండలి ఆమోదించింది. బుధవారం కళ్యాణదుర్గంలోని మంత్రి క్యాంపు కార్యాలయంలో జర్నలిస్టులు మంత్రిని కలిశారు. ఈ సందర్భంగా మంత్రిని దుశ్శాలువాలతో సత్కరించి కృతజ్ఞతలు తెలిపారు. త్వరలోనే స్థలాల పంపిణీకి చర్యలు తీసుకోవాలని కోరారు. ఇళ్ల స్థలాల పంపిణీపై సీఎం జగన్ దృఢ నిశ్చయంతో ఉన్నారని గుర్తు చేశారు. త్వరలోనే స్థల సేకరణ చేస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో జర్నలిస్టులు లింగప్రసాద్, జావీద్ అక్తర్, శ్రీనివాసులు, షాబ్‌జాన్, ఇషాక్, నరసింహ, అనీల్, రూపేష్, లక్ష్మన్న పాల్గొన్నారు.

బస్ షెల్టర్ పైకప్పు రేకులు మాయం


కమ్మూరు వద్ద బస్‌షెల్టర్ పైకప్పుకు రేకులు లేని దృశ్యం

కూడేరు: ప్రయాణికుల సౌకర్యార్థం ప్రభుత్వం ఏర్పాటు చేసిన బస్‌షెల్టర్ పైకప్పు రేకులను గుర్తు తెలియని వ్యక్తులు ఎత్తుకెళ్లారు. వివరాల్లోకి వెళితే.. మండలంలోని కుష్ఠు రోగుల కాలనీ, గొటుకూరు, బ్రాహ్మణపల్లి, కమ్మూరు, అరవకూరు, కూడేరు, ఉదిరిపికొండ, శివరాం పేట గ్రామాల వద్ద అనంతపురం–బళ్లారి ప్రధాన రహదారి పక్కన రేకులతో బస్ షెల్టర్లను ఏర్పాటు చేశారు. కమ్మూరు వద్ద అగ్రిగోల్డ్ వద్ద బస్ షెల్టర్ పైకప్పు, సైడ్ రేకులన్నింటిని, స్కంద వెంచర్ సమీపాన ఉన్న షెల్టర్ పైకప్పుకు ఏర్పాటు చేసిన రేకుల్లో ఒకదానిని గుర్తు తెలియని వ్యక్తులు ఎత్తుకెళ్లారు. దీంతో ఎండకు ప్రయాణికులు ఇబ్బంది పడుతున్నారు. సంబంధిత అధికారులు స్పందించి పైకప్పులకు రేకులు ఏర్పాటు చేయాలని ప్రజలు కోరుతున్నారు.

ఘనంగా ఆవుల దేవర పండుగ


పూజల్లో పాల్గొన్న ప్రభుత్వ విప్ కాపురామచంద్రారెడ్డి

రాయదుర్గం రూరల్: మండలంలోని చదం గొల్లలదొడ్డిలో యాదవుల సాంప్రదాయ పండుగ అయిన ఆవుల దేవరను బుధవారం ఘనంగా నిర్వహించారు. తొలుత ఎర్నాగముత్త, ఈరణ్ణ,యల్లమ్మ దేవతా మూర్తులను ఊరేగింపుగా తీసుకెళ్లి ఊరుచివర మైదానంలో కొలువు దీర్చారు. అనంతరం దేవతా మూర్తులకు మహిళలు, చుట్టు పక్క గ్రామాల ప్రజలు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆవులు, గొర్రెలు, మేకలతో పాటు వాహనాలను దేవతామూర్తుల చుట్టూ ప్రదక్షిణ చేయించారు. ప్రభుత్వ విప్ కాపు రామచంద్రారెడ్డి , రైతు విభాగం రాష్ట్ర కార్యదర్శి గౌని ఉపేంద్ర రెడ్డి, పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి మాధవరెడ్డి , హౌసింగ్ కార్పొరేషన్ డైరెక్టర్ శ్రీనివాసులు, రేకులకుంట శివారెడ్డి తో కలిసి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

కళ్యాణదుర్గం చేరిన స్కూటర్ యాత్ర

కళ్యాణదుర్గం: కరువు మండలాల్లో తక్షణ సహాయక చర్యలు తీసుకోవాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు రాంభూపాల్ సూచించారు. సీపీఎం ఆధ్వర్యంలో చేపట్టిన జిల్లా వ్యాప్తంగా జరుగుతున్న స్కూటర్ యాత్ర బుధవారం కళ్యాణదుర్గానికి చేరుకుంది. స్థానిక టీ సర్కిల్‌లో జరిగిన సభలో రాంభూపాల్ మాట్లాడారు. ముఖ్యంగా ఏడు రంగాలలో జిల్లా అభివృద్ధి సాధించాల్సిన నిర్దిష్ట ప్రణాళికలను సీపీఎం రూపొందించిందన్నారు. జిల్లాలో 31 మండలాల్లో 28 మండలాలను కరువు మండలాలుగా ప్రభుత్వం గుర్తించిందన్నారు. మిగిలిన మండలాలను కూడా కరువు మండలాలుగా ప్రకటించాలని డిమాండ్ చేశారు. ఈనెల 15న విజయవాడలో సీపీఎం ఆధ్వర్యంలో చేపట్టనున్న ప్రజా రక్షణ భేరి సభకు హాజరుకావాలని పిలుపునిచ్చారు. సీపీఎం పార్టీ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు నాగేంద్ర, బాల రంగయ్య, జిల్లా కమిటీ సభ్యుడు కృష్ణమూర్తి, చంద్రశేఖర్, నాగమణి, డీవైఎఫ్‌ఐ జిల్లా కార్యదర్శి నరసింహ, సీపీఎం నాయకులు రఘు, రంగనాథ్, భవిత్, సిద్దప్ప, సీఐటీయూ నాయకులు నాగరాజు పాల్గొన్నారు.

పౌష్టికారంతో రక్తహీనతకు చెక్


కనకూరులో సూచనలిస్తున్న సీడీపీఓ వనజాక్కమ్మ

శెట్టూరు: మండల పరిధిలోని కనుకూరు, అయ్యగార్ల పల్లి గ్రామాల్లో రక్తహీనతతో బాధపడుతున్న గర్భిణుల ఇళ్లను సీడీపీఓ వనజాక్కమ్మ, సూపర్‌వైజర్ రాధమ్మ బుధవారం సందర్శించారు. అంగన్‌వాడీ సెంటర్–1, 2 పరిధిలోని గర్భిణులకు టీహెచ్‌ఆర్ అందుతోందా లేదా అని ఆరా తీశారు. పౌష్టికారంతో రక్తహీనతకు చెక్ పెట్టవచ్చని తెలిపారు. ఐరన్ ఎక్కువగా ఉన్న ఆహారం తీసుకోవాలన్నారు. తాజా ఆకుకూరలు, కాయగూరలు, మునగ వంటి పదార్థాలు తమ ఆహారంలో ఉండేలా చూసుకోవాలని తెలిపారు. ప్రభుత్వం అంగన్‌వాడీల ద్వారా ఇస్తున్న పౌష్టికాహారం, వైఎస్సార్ సంపూర్ణ పోషకాహారాన్ని గర్భిణులు, బాలింతలు వినియోగించుకోవాలన్నారు. అనంతరం రక్తహీనత ఉన్న గర్భిణుల వివరాలు గూగుల్‌షీట్‌లో నమోదు చేశారు.

వైఎస్సార్‌సీపీ నాయకుడి మృతి



బ్రహ్మసముద్రం: మండలంలోని ముప్పలకుంట గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు, రిటైర్డ్ పోస్ట్ మ్యాన్ చాపిరయ్య (99) బుధవారం ఉదయం ఆకస్మికంగా మృతి చెందారు. విషయం తెలుసుకున్న ఎంపీపీ చంద్రశేఖర్ రెడ్డి, వైస్ ఎంపీపీ వెంకటేష్ నాయక్, సర్పంచ్ తలారి గోవిందప్ప , హనుమంతరెడ్డి తదితరులు బాధిత కుటుంబాన్ని పరామర్శించారు.

బంద్ విజయవంతం

రాయదుర్గంటౌన్: విద్యార్థి, యువజన సంఘాలు ఇచ్చిన పిలుపుమేరకు కేజీ టు పీజీ విద్యా సంస్థల బంద్ బుధవారం విజయవంతమైంది. విశాఖ ఉక్కు పరిశ్రమ ప్రైవేటీకరణ ఆపాలని, కడప ఉక్కు పరిశ్రమ ప్రారంభించాలనే ప్రధాన డిమాండ్లతో పట్టణంలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేటు విద్యాసంస్థలను బంద్ చేయించారు. కార్యక్రమంలో ఏఐఎస్‌ఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి ఆంజనేయులు, ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా అధ్యక్షుడు బంగి శివ, టీఎన్‌ఎస్‌ఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు భరత్, డీవైఎఫ్ కార్యదర్శి అనిల్, ఏఐవైఎఫ్ నియోజకవర్గ అధ్యక్షుడు కుమార్‌నాయక్ తదితరులు పాల్గొన్నారు.

కళ్యాణదుర్గం: విశాఖ ఉక్కు పరిశ్రమ ప్రైవేటీకరణను ఆపాలని డిమాండ్ చేస్తూ ఏఐఎస్‌ఎఫ్ ఆధ్వర్యంలో బుధవారం పాఠశాలలను బంద్ చేశారు. ఏఐఎస్‌ఎఫ్ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు హనుమంత రాయుడు మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం పరిశ్రమలను కార్పొరేట్ వ్యక్తులకు తాకట్టు పెట్టే యోచనలో ఉందన్నారు. విభజన చట్టంలో హామీలను అమలు చేయాలని కోరారు.

సంక్షిప్త సమాచారం

ప్రమాదాలకు ఆస్కారం ఇవ్వొద్దు

కళ్యాణదుర్గం: టపాసుల విక్రయదారులు ప్రమాదాలకు ఆస్కారం ఇవ్వకుండా జాగ్రత్తలు తీసుకోవాలని ఆర్డీఓ రాణి సుస్మిత సూచించారు. స్థానిక ఆర్డీఓ కార్యాలయంలో బుధవారం టపాసుల విక్రయదారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్డీఓ మాట్లాడుతూ.. దీపావళి పండుగను పురస్కరించుకుని క్రాకర్స్ యజమానులు పలు నిబంధనలను పాటించాలన్నారు.

ప్రజలను మభ్యపెట్టడానికే పయ్యావుల డ్రామాలు

వజ్రకరూరు: సార్వత్రిక ఎన్నికలు దగ్గర పడుతుండటంతో ఉరవకొండ ఎమ్మెల్యే పయ్యావుల కేశవ్ నియోజకవర్గ ప్రజలను మభ్యపెట్టడానికి డ్రామాలకు తెరలేపారని వైఎస్సార్ సీపీ రైతు విభాగం రాష్ట్ర కార్యదర్శి కాకర్లనాగేశ్వరరావు విమర్శించారు. బుధవారం మండల కేంద్రంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. ఎన్నికల్లో గెలిచి నాలుగున్నరేళ్లలో ఏరోజూ నియోజకవర్గ ప్రజల సమస్యలు పట్టించుకోని కేశవ్ నేడు రైతుల వద్దకు వచ్చి కపటప్రేమను చూపిస్తున్నారని ఆరోపించారు.

చికిత్స పొందుతూ యువకుడి మృతి

బొమ్మనహాళ్: మండలంలోని దేవగిరికి చెందిన రుద్రేశ్ (26) బళ్లారి విమ్స్‌లో చికిత్స పొందుతూ బుధవారం ఉదయం మృతి చెందినట్లు ఎస్ఐ శివ తెలిపారు. మద్యానికి బానిసైన రుద్రేశ్ కుటుంబ సభ్యులు మందలించడంతో మనస్తాపంతో మంగళవారం పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నం చేశాడన్నారు. చికిత్స పొందుతూ మృతి చెందినట్లు పేర్కొన్నారు.

జిల్లా సమగ్రాభివృద్ధికి చర్యలు చేపట్టాలి

కూడేరు: జిల్లాని సమగ్రాభివృద్ధికి ప్రభుత్వం చర్యలు చేపట్టాలని సీపీఎం జిల్లా కార్యదర్శి రాంభూపాల్ విజ్ఞప్తి చేశారు. సీపీఎం ఆధ్వర్యంలో ప్రజా రక్షణభేరి కార్యక్రమంలో భాగంగా చేపట్టిన స్కూటర్ యాత్ర బుధవారం కూడేరుకు చేరుకుంది. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ తక్షణం కరువు సహాయక చర్యలు చేపట్టాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

కూడేరులో మోస్తరు వర్షం

కూడేరు: మండలంలో బుధవారం రాత్రి మోస్తరు వర్షం కురిసింది. ఈ వర్షంతో ఎండుముఖం పట్టిన పంటలకు ఊరట లభిస్తుందని రైతులు ఆశాభావం వ్యక్తం చేశారు.

సామాజిక కార్యక్రమాల్లో ఎస్‌బీఐ

కళ్యాణదుర్గం: సామాజిక సేవా కార్యక్రమాలలో స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఎల్లప్పుడూ ముందుగా ఉంటుందని ఎస్‌బీఐ ఆర్‌ఎం వెంకటేశ్వరరావు చెప్పారు. స్థానిక బావి బసప్ప వీధిలో బుధవారం శాంతి కుమార్తె దివ్యాంగురాలు హారికకు చక్రాల కుర్చీని అందజేశారు. కార్యక్రమంలో ఎస్‌బీఐ మెయిన్ బ్రాంచ్ మేనేజర్లు నాగసుధ, హెచ్‌ఆర్ మేనేజర్ సురేంద్రకుమార్, పట్టణ బ్యాంక్ మేనేజర్లు ఏడుకొండలు, ప్రభు, బ్యాంకు సిబ్బంది పాల్గొన్నారు.

నేడు 'గడప గడపకూ మన ప్రభుత్వం'

వజ్రకరూరు: కొనకొండ్ల గ్రామంలో గురువారం ఉదయం గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించనున్నట్లు వైఎస్సార్‌సీపీ రైతువిభాగం రాష్ట్ర కార్యదర్శి వెంకటరెడ్డి, మండలాధ్యక్షుడు సోమశేఖర్‌రెడ్డి, ఎంపీపీ రమావత్‌దేవి తెలిపారు. అనంతపురం ఎంపీ తలారిరంగయ్య మాజీ ఎమ్మెల్యే, నియోజకవర్గ ఇన్‌చార్జ్ వై.విశ్వేశ్వరరెడ్డి హాజరవుతారన్నారు. ప్రజాప్రతినిధులు, అధికారులు, వైఎస్సార్‌సీపీ శ్రేణులు పాల్గొనాలని కోరారు.

సాక్షి
సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
రాయదుర్గం డివిజన్
9010470185, 9010006852, 9010223701